## ప్రొఫెషనల్ కోర్సుల్లో అడ్మిషన్లకు కసరత్తు

- ప్రవేశ పరీక్షలకు త్వరలో కన్వీనర్ల నియామకం
- యూనివర్సిటీలకు ఉన్నత విద్యామండలి లేఖలు

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు కసరత్తు మొదలైంది. సంబంధిత ఎంట్రెన్స్ టెస్టులు నిర్వహించేందుకు ఉన్నత విద్యామండలి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఆయా ప్రవేశ పరీక్షల నిర్వహణకు అంగీకారాన్ని కోరుతూ జేఎన్టీయూ, ఉస్మానియా, కాకతీయ, శాతవాహన వర్సిటీలకు ఇటీవల లేఖలు రాశారు. నిరుడు ఈ ప్రవేశ పరీక్షలను నిర్వహించిన వర్సిటీలకే ఈసారి కూడా అవకాశం కల్పించనున్నట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రవేశ పరీక్షలన్నీ మేలో జరగనున్నాయి. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష మే రెండో వారంలో జరగనున్నది. ఈ ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతను ఈసారి సైతం జేఎన్టీయూహెచ్‌కే అప్పగించనున్నారు. ఉన్నత విద్యామండలి లేఖలకు స్పందించిన వర్సిటీల వీసీలు.. కన్వీనర్ల ఎంపిక కోసం ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లను ఉన్నత విద్యామండలికి ప్రతిపాదించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్ నిర్వహణకు శాతవాహన వర్సిటీ ఆసక్తి చూపింది. ఈ ప్రవేశ పరీక్ష నిర్వహణ కోసం ఆ వర్సిటీ ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లను ప్రతిపాదించింది.

**నిరుడు ప్రవేశ పరీక్షలు నిర్వహించిన వర్సిటీలు**

| ప్రవేశ పరీక్ష | నిర్వహించిన వర్సిటీ |
|---|---|
| ఎంసెట్ | జేఎన్టీయూహెచ్ |
| పీజీఈసెట్ | జేఎన్టీయూహెచ్ |
| ఎడ్‌సెట్ | ఉస్మానియా |
| లాసెట్ | ఉస్మానియా |
| ఈసెట్ | ఉస్మానియా |
| పీఈసెట్ | శాతవాహన |
| ఐసెట్ | కాకతీయ |

## కేఎల్ విద్యార్థికి రాయల్ మిస్టర్ ఇండియా టైటిల్

మాదాపూర్, జనవరి 17: హైదరాబాద్ కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థి కే వరుణ్ చౌదరి ప్రతిష్ఠాత్మకమైన రాయల్ మిస్టర్ ఇండియా టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ కోర్సు చదువుతున్న వరుణ్ చౌదరి ఇటీవల జైపూర్‌లోని రాయల్ ప్రొడక్షన్ హౌస్ నిర్వహించిన ఈ పోటీల్లో విజేతగా నిలిచి సత్తా చాటాడు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా మొత్తం 90 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్నారు. 12 మంది ఫైనలిస్టుల్లో స్థానం సంపాదించడమే కాకుండా ఫైనల్ పోటీల్లో వరుణ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. విద్యార్థుల నైపుణ్యాలు, సామర్థ్యాలకు బహుళ రౌండ్లలో జరిగిన కఠినమైన పరీక్షల్లో వరుణ్ విశేష ప్రతిభ చాటాడని వర్సిటీ వీసీ జీ పార్థసారథి వర్మ కొనియాడారు. ఈ మేరకు వరుణ్ చౌదరిని ఆయనతోపాటు అధ్యాపకులు బుధవారం అభినందించారు. వరుణ్ గతంలో కూడా వివిధ పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విశేష ప్రతిభ చాటాడు.

రాయల్ మిస్టర్ ఇండియా టైటిల్ విజేత వరుణ్ చౌదరిని అభినందిస్తున్న కేఎల్ యూనివర్సిటీ అధ్యాపకులు

### విద్యా - ఉద్యోగ సమాచారం

#### టీహబ్‌లో స్టార్టప్ యాక్సలరేటర్ కార్యక్రమం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): స్టార్టప్ కంపెనీలకు మద్దతు ఇస్తూ ప్రపంచ స్థాయిలో కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన వనరులను, నైపుణ్యాన్ని అందించడానికి అమెరికాకు చెందిన ఫాల్కన్ ఎక్స్ కంపెనీతో కలిసి స్టార్టప్ యాక్సలరేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. డీప్‌టెక్ సీడ్ ఫండ్ పొందిన స్టార్టప్‌లను ఫాల్కన్ ఎక్స్ యాక్సలరేటర్ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎంపికైన స్టార్టప్‌లకు దేశ, విదేశాల్లో వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ఫాల్కన్ ఎక్స్ యాక్సలరేటర్ కృషి చేస్తుందని టీ హబ్ ప్రతినిధి పేర్కొన్నారు.

#### 24 నుంచి టీవర్క్స్‌లో మేకర్ హ్యాకథాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): 'భవిష్యత్తుకు పరిష్కారాలు' అనే నినాదంతో టీ వర్క్స్‌లో మేకర్ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నామని టీ వర్క్స్ ప్రతినిధి తెలిపారు. యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లోని టీ వర్క్స్ వేదికగా ఈ నెల 24, 25, 26 తేదీల్లో మేకర్ హ్యాకథాన్ ఫర్ సస్టెయినబిలిటీ కార్యక్రమం ప్రవాహ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో ఔత్సాహిక ఆవిష్కర్తలతో పాటు విద్యార్థులు పాల్గొనవచ్చని వెల్లడించారు. వివరాలకు టీ వర్క్స్‌లో సంప్రదించాలని తెలిపారు.

#### 'క్యూర్'తో హెచ్‌సీయూ, ఇఫ్లూలో రిక్రూట్‌మెంట్

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా ఉన్న వర్సిటీల్లో అడ్మిషన్లను ఏకీకృత పద్ధతిలో చేపడుతున్న కేంద్రం తాజాగా వర్సిటీల్లో రిక్రూట్‌మెంట్‌కు ఏకీకృత పద్ధతిని అమలుచేస్తున్నది. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి సెంట్రల్ యూనివర్సిటీస్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ (క్యూర్)–2023ను నిర్వహించనున్నది. వర్సిటీల్లో గ్రూప్ –బీ, గ్రూప్ –సీ క్యాటగిరీ పోస్టును క్యూర్ ద్వారా భర్తీ చేస్తారు. ఈ విధానానికి దేశంలోని ఆరు వర్సిటీలు అంగీకరించగా, మన రాష్ట్రంలోని ఇఫ్లూ, హెచ్‌సీయూలు ఆ జాబితాలో చేరాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ పోస్టుల నియామక రాత పరీక్షలను నిర్వహించనున్నది.

#### బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) క్యాలెండర్, డైరీని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. బీసీ ఉద్యోగులు, టీచర్లకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని, క్రీమీలేయర్‌ను తొలగించాలని ఈ సందర్భంగా బీసీటీఏ నేతలు కోరారు. టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, ఉపాధ్యక్షుడు ఎంఎన్ విజయ్‌కుమార్, రాములు, రాఘవేందర్, మల్లేశ్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

#### కేజీబీవీ పనివేళలు మార్చండి: టీఎస్‌జీహెచ్‌ఎంఏ

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): కేజీబీవీల్లో అమలుచేస్తున్న పనివేళలను మార్చాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ నేతలు బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. నలుగురు గెజిటెడ్ ఉద్యోగులు నిర్వహించాల్సిన బాధ్యతలను స్పెషలాఫీసర్లకు వేయడం తగదని, నైట్ డ్యూటీలను మార్చాలని కోరారు. లోకల్ హాలిడే, ఆప్షనల్ హాలిడేలను ఎంచుకునే అవకాశం కల్పించాలని, వార్డెన్లను నియమించాలని, ఇంటర్మీడియట్ వరకు గల కేజీబీవీల్లో నెలకు 10 వేల ప్రత్యేక అలవెన్స్‌ను అదనంగా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజు గంగా రెడ్డి, కోశాధికారి తుకారం, గిరిధర్, మోయిద్, లక్ష్మణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కోటి ప్రత్యంగిరా మహాయాగం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న శివకోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, వెంకటరమణశర్మ, విఠలశర్మ

## 21 నుంచి కోటి ప్రత్యంగిరా మహాయాగం

- 28 వరకు హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహణ
- కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరపీఠం ధర్మాధికారి వెల్లడి

ఖైరతాబాద్, జనవరి 17: కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరపీఠం ఆధ్వర్యంలో జగద్గురు సిద్ధేశ్వరానందభారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా దేశంలోనే తొలిసారిగా ఈ నెల 21 నుంచి 28 వరకు 108 హోమగుండాలతో కోటి ప్రత్యంగిరా మహాయాగాన్ని నిర్వహిస్తామని పీఠం ధర్మాధికారి వల్లూరు శివకోటేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ క్రతువుకు సంబంధించిన బ్రోచర్లను పీఠం కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్, దర్శనం పత్రిక ఎడిటర్ మరుమాముల వెంకటరమణ శర్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌స్టేడియం వేదికగా 25 వేల కేజీల ఎండు మిరపకాయలతో ఈ మహాక్రతువు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు యాగశాల కలశ మండప పూజలు, 10 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కోటి ప్రత్యంగిరాయాగం, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీ లలిత, విష్ణు, సౌందర్యలహరి పారాయణం, రాత్రి 7 గంటల నుంచి జగద్గురు సిద్ధేశ్వరానందభారతి మహాస్వామి అనుగ్రహభాషణం ఉంటుందని చెప్పారు.

# జీవో 55ను రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం

- యూనివర్సిటీ భూములు హైకోర్టుకు ఇవ్వొద్దు
- నేటినుంచి తరగతుల బహిష్కరణ
- మద్దతు తెలిపిన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ రవిబాబువిరల్
- 9వ రోజూ కొనసాగిన నిరసన

విద్యార్థుల ధర్నాలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవిబాబువిరల్

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 17: వ్యవసాయ యూనివర్సిటీ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ హైకోర్టుకు ఇవ్వొద్దని, అందుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 55ను వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు హెచ్చరించారు. బుధవారం 9వ రోజు ఉదయం నుంచే వర్సిటీ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తరగతులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. 'సేవ్ ద యూనివర్సిటీ ల్యాండ్స్', 'సేవ్ ఫార్మర్స్', 'స్టూడెంట్ పవర్.. నేషనల్ పవర్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాజేంద్రనగర్ యూనివర్సిటీతోపాటు రాష్ట్రంలోని పాలెం, వరంగల్, సిరిసిల్ల, అశ్వరావుపేట, జగిత్యాల, ఆదిలాబాద్, సంగారెడ్డిలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం నుంచి తరగతులను బహిష్కరిస్తున్నట్టు చెబుతూ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు నిర్మాణంతో వర్సిటీ పరిధిలోని పర్యావరణం దెబ్బతింటుందని, వ్యవసాయ పరిశోధనలకు అపారనష్టం వాటిల్లుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వం పునరాలోచించాలి**

వర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మించి యూనివర్సిటీని చీల్చడం సరికాదని జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్, పర్యావరణవేత్త రవిబాబు విరల్ ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షణికావేశంతో, స్వార్థంతో తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తు తరాలకు తీరని నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు వ్యవసాయ సంఘాలు, రైతులతోపాటు ప్రజలు కూడా ఉద్యమం చేపట్టి యూనివర్సిటీని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. వేలాదిమంది వ్యవసాయ విద్యార్థులకు, ప్రధానంగా రాష్ట్ర రైతాంగానికి యూనివర్సిటీ అండగా ఉందని పేర్కొన్నారు. తొమ్మిదోరోజు నిరసనలో వర్సిటీ కళాశాల విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శంకర్‌నాయక్, రాకేశ్ పాల్గొన్నారు.

### శ్రీవారి సేవా టికెట్ల ఏప్రిల్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 17(నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ దర్శనానికి ఏప్రిల్ నెల దర్శనం, ఆర్జిత సేవా టికెట్ల కోటా షెడ్యూల్‌ను టీటీడీ బుధవారం వెల్లడించింది. ఈ నెల 18 నుంచి 27 వరకు భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాద పద్మారాధన సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు 22న మధ్యాహ్నం 12 గంటలలోపు నిర్ణీత రుసుం చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవా టికెట్లు 22న ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవా టికెట్లు 22న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. ఏప్రిల్ 21 నుంచి 23 వరకు జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవ సేవా టికెట్లను ఇదేనెల 22న ఉదయం 10 గంటలకు, అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్టు టీటీడీ ప్రకటించింది.

# ఫాస్టాగ్ కేవైసీకి 31 వరకు గడువు

- ఫాస్టాగ్ దుర్వినియోగానికి కళ్లెం
- తెరపైకి 'వన్ వెహికిల్.. వన్ ఫాస్టాగ్' విధానం
- కేవైసీ చేయకుంటే ఫాస్టాగ్ డీయాక్టివేట్

హైదరాబాద్, జనవరి 17(నమస్తే తెలంగాణ): ఒకే ఫాస్టాగ్‌తో పలు వాహనాలు వినియోగిస్తుండడం, కేవైసీ పూర్తికాకుండానే ఫాస్టాగ్‌లను జారీచేస్తున్నట్టు గుర్తించిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ ఏఐ) వీటికి అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'వన్ వెహికిల్.. వన్ ఫాస్టాగ్' విధానానికి శ్రీకారం చుట్టింది. ఇకపై ఫాస్టాగ్ వినియోగదారులు తప్పకుండా కేవైసీ పూర్తిచేయాల్సిందేనంటూ అందుకు ఈ నెల 31 వరకు గడువు విధించింది. ఆ తర్వాత ఫాస్టాగ్‌లు డీయాక్టివేట్ అయ్యే అవకాశం ఉంది. కాబట్టి వినియోగదారులు ఆలోపు కేవీసీ పూర్తిచేసుకోవాల్సి ఉంటుంది.

**కేవైసీ చెక్ చేసుకోవడం ఎలా?**

వినియోగదారుడు తొలుత ఫాస్టాగ్ అధికారిక వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవాల్సి ఉంటుంది. ఓటీపీ అథెంటిఫికేషన్ పూర్తయిన తర్వాత డ్యాష్‌బోర్డులో మై ప్రొఫైల్ సెక్షన్‌లోకి వెళ్లి కేవైసీ స్టేటస్ చెక్ చేసుకోవచ్చు.

**ఐడెంటిటీ ప్రూఫ్‌తో అప్‌డేషన్**

ఫాస్టాగ్ కేవైసీ పెండింగ్‌లో ఉంటే సబ్ సెక్షన్ ద్వారా అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇందుకోసం అవసరమైన గుర్తింపుకార్డుతోపాటు వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, అడ్రస్ ప్రూఫ్‌తోపాటు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో కావాల్సి ఉంటుంది. అన్ని అప్‌లోడ్ చేసిన తర్వాత ఒకసారి చెక్‌చేసుకుని సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత కంటిన్యూపై క్లిక్‌చేస్తే కేవైసీ వెరిఫికేషన్ పూర్తవుతుంది.

## ఎమ్మార్సీఎస్ ద్వారా సర్జన్ల నైపుణ్యం మెరుగు

- కిమ్స్-ఉషాలక్ష్మి క్యాన్సర్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్ రఘురామ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇంగ్లాండ్ సంస్థ నిర్వహించే ఎమ్మార్సీఎస్ ఇంటర్ కొలీజియేట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి శిక్షణ పూర్తి చేసుకున్న సర్జన్లలో నైపుణ్యాలు, జ్ఞానం మరింత పెంపొందుతాయని కిమ్స్–ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ పీ రఘురామ్ తెలిపారు. రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇంగ్లాండ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రతిష్ఠాత్మకమైన ఎమ్మార్సీఎస్ ఫైనల్ ఎగ్జామ్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏటా జరిగే ఎమ్మార్సీఎస్ పరీక్ష హైదరాబాద్ నగరంలో తొలిసారిగా 2015లో నిర్వహించారని, ఆ తరువాత మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 17నుంచి 22 వరకు ఆరు రోజులపాటు నిర్వహించే ఈ పరీక్షలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 240 మంది సర్జికల్ ట్రైనీలు, యూకే తోపాటు దేశంలోని 35 మంది ఎగ్జామినర్లు నగరానికి వచ్చారని వివరించారు.

### రాష్ట్రానికి కొత్తగా ఆరుగురు ఐపీఎస్‌లు

హైదరాబాద్, జనవరి 17 (జనవరి): రాష్ట్ర క్యాడర్‌కు కొత్తగా ఆరుగురు ఐపీఎస్ అధికారులను కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఇటీవల శిక్షణ పూర్తిచేసుకున్న 200 మంది యువ ఐపీఎస్ అధికారులకు బుధవారం రాష్ట్రాలను కేటాయించారు. ఇందులో 2022 బ్యాచ్‌కు చెందిన ఆరుగురిని తెలంగాణకు ఇచ్చారు. వీరిలో తెలంగాణకే చెందిన పత్తిపాక సాయికిరణ్, రుత్విక్‌సాయి కొట్టె ఉండగా, మధ్యప్రదేశ్‌కు చెందిన అయేషా ఫాతిమా, మహారాష్ట్రకు చెందిన మంధారే సోహం సునీల్, జమ్ముకశ్మీర్‌కు చెందిన మన్నన్ భట్, జార్ఖండ్‌కు చెందిన రాహుల్ కాంత్ ఉన్నారు.

### 20న పాస్‌పోర్ట్ అదాలత్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 17 ( నమస్తే తెలంగాణ) : సికింద్రాబాద్‌లోని రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో ఈ నెల 20న పాస్‌పోర్ట్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి జే స్నేహజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తితే అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అదాలత్ కొనసాగనున్నదని వెల్లడించారు. పాస్‌పోర్టుకు సంబంధించిన అవసరమైన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని తెలిపారు.

### భారత్ గౌరవ్ రైళ్లలో 96 వేల మంది ప్రయాణం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ): భారత్ గౌరవ్ రైళ్లలో నిరుడు 96 వేల మంది భక్తులు ప్రయాణం సాగించినట్టు బుధవారం రైల్వే అధికారులు వెల్లడించారు. 172 పర్యాటక ట్రిప్పులతో వారంతా 24 రాష్ట్రాల్లోని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలను సందర్శించారని పేర్కొన్నారు. అయోధ్య నుంచి జనక్‌పూర్, శ్రీరామ్ జానకి యాత్ర, జగన్నాథ్ యాత్ర, గర్వి గుజరాత్ తదితర పర్యాటక ప్రాంతాలతోపాటు అంబేద్కర్ సర్క్యూట్, నార్త్ ఈస్ట్ టూర్ వంటి ప్రధాన టూరిస్ట్ సర్క్యూట్లను భారత్ గౌరవ రైళ్లు చుట్టి వచ్చినట్టు తెలిపారు. ఈ యాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

# వెయిటేజీ భారం దూరం

- ఈ ఏడాది ఇంటర్ వెయిటేజీ లేకుండానే ఇంజినీరింగ్, ఫార్మా అడ్మిషన్లు
- ఎంట్రెన్స్ ఆధారంగానే సీట్లు
- తగ్గనున్న మార్కుల క్రోడీకరణ జంజాటం

**విద్యార్థులపై ఒత్తిడి తగ్గింది**

ఇంటర్ వెయిటేజీ రద్దుతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గింది. టెన్షన్ దూరమైంది. సహజంగా డిగ్రీ వైపు వెళ్లే విద్యార్థులు ఇంటర్ మార్కుల కోసం.. ఇంజినీరింగ్ వైపు వెళ్లేవారు ఎంట్రెన్స్‌తో పాటు ఇంటర్ మార్కులపై దృష్టిపెడతారు. రెండింటిపై దృష్టిపెట్టడం వల్ల ఎక్కడ పొరపాటు జరిగినా ర్యాంకు కోల్పోవాల్సిన పరిస్థితులుండేవి. వెయిటేజీని శాశ్వతంగా ఎత్తివేయడంతో విద్యార్థులకు ఉపశమనం కలుగుతున్నది. ఇప్పుడు ఎంట్రెన్స్ పరీక్షపై దృష్టి పెట్టే సమయం దొరుకుతున్నది. దీంతో విద్యార్థులు మంచి ర్యాంకు సాధించే అవకాశాలు పెరిగాయి.

- ఎం నాగభూషణ్‌రావు (ఎంఎన్‌రావు), గణితం సబ్జెక్టు నిపుణుడు

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది ఇంజినీరింగ్, ఫార్మా వంటి కోర్సుల్లో ఇంటర్ వెయిటేజీ లేకుండానే ప్రవేశాలు జరుగనున్నాయి. ఈ వెయిటేజి తొలగింపు విధానంతో విద్యార్థులకు ఒత్తిడి దూరం అవడమేగాక, ఉపశమనం లభిస్తున్నది. ఎంసెట్ ( త్వరలో టీఎస్ ఈఏపీ సెట్‌గా మారనున్నది)లో ఇదివరకు ఇంటర్ వెయిటేజీ అమలయ్యేది. ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్, మెడికల్, డెంటల్, ఫార్మ –డీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్ వెయిటేజీని 2011 నుంచి అమలుచేస్తున్నారు. అప్పట్లో ప్రభుత్వం జీవో –73 ద్వారా వెయిటేజీని అమలు చేసింది. ఎంసెట్ మార్కులను 75శాతం, ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీని అమలు చేశారు. ఈ విధానంతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగేది. ఎంసెట్, ఇంటర్ పరీక్షలు భిన్నంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులుపడేవారు. ఇంటర్ వార్షిక పరీక్షలను వ్యాస రూపంలో, ఎంసెట్‌ను ఆబ్జెక్టివ్ విధానంలో రాయాల్సి ఉండటంతో రెండింటికి సన్నద్ధమయ్యేందుకు విద్యార్థులు తిప్పలుపడేవారు. పైగా వెయిటేజీ కారణంగా ప్రధాన ర్యాంకులను కార్పొరేట్ కాలేజీల్లోని విద్యార్థులు ఎగరేసుకుపోతున్నారన్న అపోహలుండేవి. గ్రామీణ విద్యార్థులు తక్కువ మార్కులతో నష్టపోతున్నారన్న భావనలుండేవి. పైగా ఎంసెట్‌లో మంచి మార్కులొచ్చినా ఇంటర్‌లో మార్కులు రాకపోతే ఉత్తమ ర్యాంకు కోల్పోవాల్సి వచ్చేది. సీబీఎస్ఈ, స్టేట్‌బోర్డు, ఐసీఎస్ఈ, ఓపెన్ స్కూల్ వంటి వాటిల్లో గ్రేడింగ్ విధానం, మార్కుల విధానం వేరుగా ఉంటుంది. దీంతో ఫలితాలు వెల్లడించడం ఇబ్బందిగా ఉండేది. గ్రేడింగ్‌లో అధిక మార్కులు రావడం, మార్కుల విధానంతో స్టేట్ బోర్డు విద్యార్థులకు తక్కువ మార్కులు రావడంతో అసమానతలకు దారితీసేది. ఇది తెలంగాణ ఇంటర్ బోర్డు పరీక్షలు రాసిన విద్యార్థులకు నష్టం కలిగించేది. వీటికి ముగింపు పలుకుతూ ఎంసెట్‌లో ఇంటర్ వెయిటేజీని ప్రభుత్వం 2023లో శాశ్వతంగా రద్దుచేసింది. తాజాగా విడుదలయ్యే 2024 ప్రవేశాలకు కూడా ఇంటర్ వెయిటేజీ లేకుండా అధికారులు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు.

**రద్దుతో ప్రయోజనాలివి..**

- ఇదివరకు ఎంసెట్‌లోని 160 మార్కులను 75శాతం మార్కులుగా, ఇంటర్‌లో సాధించిన మార్కులకు 25శాతం మార్కులుగా భావించి ర్యాంకులను కేటాయించే వారు. కానీ ఇప్పుడు ఎంసెట్‌లోని 160 మార్కులను 100శాతం మార్కులుగా లెక్కలోకి తీసుకొని ర్యాంకులను ప్రకటిస్తారు.
- ఫలితాలు వచ్చాక, ఇంటర్ మార్కులను క్రోడీకరించి ర్యాంకులు కేటాయించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు క్రోడీకరణ జంజాటం తప్పింది.
- ఇది వరకు వెయిటేజీ కారణంగా విద్యార్థులు ఇంటర్లో మంచి మార్కులు సాధించేందుకు పోటీపడేవారు. కానీ ఇప్పుడా అవసరం లేకుండా పోయింది. పూర్తిగా ఎంసెట్‌పైనే దృష్టి పెట్టే అవకాశం దొరికింది.
- ఇంటర్ ఫలితాలతో సంబంధం లేకుండానే ఎంసెట్ ఫలితాలను అత్యంత వేగంగా విడుదల చేయవచ్చు.
- ఎంసెట్‌కు హాజరయ్యేందుకు ఇంటర్‌లో నిర్దిష్ట మార్కులు పొంది ఉండాలి. జనరల్ విద్యార్థులు 45శాతం, రిజర్వ్‌డ్ క్యాటగిరీ విద్యార్థులు 40శాతం మార్కులను సాధిస్తేనే ఎంసెట్‌కు హాజరయ్యే అవకాశం ఉంటుంది.

## మహిళలకు ఉచిత ప్రయాణంపై పిల్

- వివక్షాపూరితమన్న పిటిషనర్
- ఆర్టీసీ వ్యవహారాలపై ప్రభుత్వానికి నిర్ణయాధికారం లేదని స్పష్టీకరణ
- జీవో 47ను ఎత్తేయాలని విజ్ఞప్తి
- త్వరలో హైకోర్టు విచారణ

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఆర్టీసీ వ్